# కల్పన

టెలిఫోన్ మోగింది. వొంటవాడికి పోపుసామాను అందిస్తున్న అనురాధ టేబిల్ దగ్గిరికి పరుగెత్తింది.

"హలో! హలో!!"

"... ... ..."

"ఎవరు పిల్చింది? మీరా?"

"... ... ..."

"ఏమిటి విశేషాలు? సినిమాకి వెడదామంటారా?"

"... ... ..."

"పోనీ, రేపు వెళ్ళకూడదూ ?"

"... ... ..."

"సరే, మీ యిష్టం !"

కింద వుంచింది. టెలిఫోనులో పిల్చింది ఆమె భర్త మోహనరావు. "ఏదో కొత్త ఇంగ్లీషు ఫిల్ము వచ్చింది; దానికివెడదాం" అన్నాడు.

సాయంత్రం అయిదున్నరయింది. అంతవరకూ పనిలో నిమగ్నురాలైవున్న అనూరాధకి వీధిలో మోగిన హారన్ స్మృహ కలిగించింది.

తర్వాత బూట్లచప్పుడు! మోహనరావు లోపలికొచ్చాడు.

అనూరాధ ఎప్పట్లానేవుంది. సరిగ్గా తలన్నా దువ్వుకోలేదు; ఉదయంకట్టిన బట్టలే కట్టుకునుంది.

మోహనరావు మొహం కత్తివేటుకి కూడా నెత్తురుచుక్క అందనట్టు మారింది.

"ఏమిటీ వేషం?... ఇంకా తయారుకాలే?" అన్నాడు, కొంచెం చికాకుగా.

అనూరాధ కూడా ఆమాటకి మొహం చిన్నబుచ్చుకుంది. కాని తన్ని సమర్థించుకోసాగింది!

"ఏదీ... పనితోనే సరిపోయింది, ఇప్పటిదాకా! ఒక్క క్షణంలో తయారవుతా... ఎంత సేపు?"

కంగారుపడుతో అంది. కాని ఆమెకే తెల్సు భర్తకి అయిష్టంగా ప్రవర్తించినట్టు అతని ముఖలక్షణాలే తెలియజేస్తున్నాయని లోపల నొచ్చుకుంది తన నడతకి తనే.

మోహనరావు ఒక క్షణం అట్లానే నిలబడి తర్వాత కుర్చీలో ఆలోచిస్తూనే కూలబడ్డాడు: అతని మొహంమీద ఒకవిధమైన నిరాశ తాండవం ఆడుతోంది. 'ప్చ్' అనుకున్నాడు ఏదో ఆలోచన సాగిస్తూ.

అనూరాధ ట్రేతో టీ తీసుకొచ్చింది. తర్వాత కలిపి అతని కందిచ్చింది. అతను టీ పొగని వింతగా చూస్తున్నాడు.

"ఏం తాగరేం? కోపమొచ్చిందా?" అనూరాధ అడిగింది.

మోహనరావు సర్దుకున్నాడు, భార్య నడత తనకి కష్టం కలిగించిందనే సంగతిని, ఆమె గ్రహించడం అతనికిష్టంలేదు. ఎందుకంటే అనూరాధ మనస్సు ఎంత సున్నితమయిందీ అతనెరుగును. ఏ విధంగానూ ఆమెకి బాధ కలిగించడం అతని వుద్దేశం కాదు. అందుకే అన్నాడు!

"అబ్బే! అందుకు కాదులే!"

టీ రెండు గుక్కలు తాగాడు. తర్వాత:

"కల్పనకనక అయితేనా?" అన్నాడు.

అనూరాధ తనుకూడా టీ తాగడం మాని ఆశ్చర్యంతో అడిగింది!

"అస్తమానూ కల్పన, కల్పన అంటారు, ఎవరండీ ఆవిడ?"

మోహనరావు ఆమెకేసి పరిశీలనగా చూస్తూ అన్నాడు:

"కల్పన నాతోబాటు ఒకే కాలేజీలో చదివింది. చాలా తెలివైందీ; అందమైందీని. స్వతస్సిద్ధమైన అందమేకాకుండా అందాన్ని పోషించుకోడంలో కూడా మంచినేర్పరి. నేనంటే చాలా యిష్టంగా చూసుకునేది. అందుకే నాకిష్టమైనట్టుగా ప్రవర్తించేది."

అనూరాధ తనకి అయిష్టంగా ప్రవర్తించినప్పుడల్లా "కల్పనయితేనా?" అంటాడు మోహనరావు. ఆ మాటలు వినడానికి ఎంతో యిష్టం పుట్టుకొస్తుంది అనూరాధకి. ఇంకా వివరాలు పట్టి, పట్టి అడుగుతుంది. మోహనరావు ఎంతో ఓపికతో చెబుతాడు: కల్పన తెలివితేటల్నీ, చర్యల్నీ.

ఒకటి రెండుసార్లు అనూరాధ తనలో అనుకునుంటుందికూడా : "కల్పన అంత తెలివైంది, అందమైందీట. ఒకవేళ ఏదేవతైనా కల్పనై జన్మించిందిగావును! ఎంత అదృష్టమో? ఎవరు పెళ్ళిచేసుకున్నారో ఆ దేవతని?"

అనూరాధ తెలివితేటలు లేంది అనీ అనలేరు, ఎవరూను. కాని వొచ్చిన చిక్కేమిటంటే ఆమె ఎప్పుడూ తన జ్ఞానాన్నంతా గృహకృత్యాలు నెరవేర్చడంలోనే వుపయోగిస్తుంది. ఆ పన్లు చెయ్యడం ఆమెకిష్టం, హాబీ.

కాని ఈ తెలివితేటలు మోహనరావుకి అమితమైన ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ కలిగించినా, తను కోరినట్టు సినిమాకి వేళకి రాకపోడం, పార్కుకి రాననడం, యిట్లాంటివి చూస్తే అతనికి తలనొప్పి.

అట్లాంటి సమయాల్లోనే కల్పనని తోడు తెచ్చుకుంటాడు. కల్పనని గురించి గొప్పగా చెబుతాడు. ఆ మాటలు అనూరాధకి ఒక విధమైన ఉద్రేకాన్నిస్తాయి. 'మనం మాత్రం అట్లా స్తుతి చెందదగిన వాళ్ళంగా ఎందుకు కాకూడదు?' అనుకుంటుంది. అతనికిష్టమైనట్టే నడుచుకోడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది. అదే మోహనరావు ఆశయం కూడా.

మొత్తంమీద ఆ వేళటికి అతనికి సినిమా లేదు. అట్లాగే పబ్లిక్ గార్డెన్సు చూడ్డాలూ, అతను తెచ్చిన మేగ్‌జైన్‌లు చదవడాలూ లేకపోవచ్చును.

కాని అది కొంతకాలమే. చివరికి కొన్నాళ్ళకి కల్పనని గురించిన వుపన్యాసాల ద్వారా మోహనరావు తన ప్రయత్నాల్లో నెగ్గాడు. అనూరాధ యిప్పుడు అతని అభిరుచులకి అనుగుణంగా నడుచుకుంటోంది.

మామూలు చదువు, సినిమాలూ చూడడాలూ కాకుండా, మోహనరావు అనూరాధకి చిత్రకళలో అభిరుచి కలిగించాడు. ఇప్పుడు అనూరాధ చక్కగా చిత్రాలు గీయకలదు. పాటలు కూడా పాడుతుంది.

మోహనరావుకి అనూరాధంటే ప్రాణతుల్యం. అనూరాధకి మోహనరావు భర్తా, గురువూ, ప్రియుడూను.

క్రమ క్రమంగా మోహనరావు కల్పన తెలివితేటల్ని గురించిన మాటల్ని మాట్లాడ్డం మానేశాడు. అతనికి వాటి అగత్యమూ లేకపోయింది.

ఆవేళ ఒక చిత్రకళా ప్రదర్శనంలో అనూరాధ గీసిన స్కెచ్‌కి మొదటి బహుమానం వొచ్చింది.

అది చూసిన మోహనరావు సంతోషానికి మేర లేకపోయింది.

"ఎంతో సంతోషంగా వుంది నాకీవేళ" అన్నాడు మోహనరావు రాత్రి భోజనాలైయ్యాక.

"నాలో ఏముంది, మీరు నేర్పిందికాక" అంది అనూరాధ, తాంబూలం అందిస్తూ.

"నేనూకాదు; ఇదంతా నా కల్పన చేసిన సహాయమే" అన్నాడు.

"నన్ను ఆ కల్పనదగ్గిరికి ఓసారి తీసుకుపోరూ? చాలా రోజుల్నించి చూడాలనుంది!" అంది అనూరాధ.

"చెప్పానుకదూ, అంతకీ నా కల్పనే కారణమని ఇప్పుడే" మోహనరావు నిజం వెళ్ళగక్కాడు.

"అట్లా నేం?" అంది ఆశ్చర్యంతో చూస్తూ అనూరాధ, ఇన్నాళ్లూ భ్రమపెట్టిన ఆ కల్పిత వ్యక్తి కల్పనేనని తల్చుకుంటూ.

*09. 03. 1947–ఆనందవాణి వారపత్రిక*